శ్రీ కాసల నాగభూషణం

# శిల్పంలో శ్రీరాముడు

మనిషి తనని సృష్టించిం దగ్గర్నుంచీ అతని అవసరాలను తీర్చి తీర్చి, ఆపదలను పాపి పాపి ఆఖరికి తను నిలవడానికి నీడ కూడా లేనివాడయ్యేడు దేవుడు సీతారామపురంలో.

ఆ వూళ్లో దేవుడి పేరు పట్టాభిరాముడు.

ఎకరం కొబ్బరితోట, అర ఎకరం పంటపొలం, మరీ అంత పెద్దది కాకున్నా చుట్టూ ప్రహరీ. ఓ గిలక బావి, నడుమన పరిచిన నల్లబండల చప్టా, చెక్కలో చెక్కి నిలిపిన రెండు నిలువుల ధ్వజస్తంభం, తులసికోట, శిఖరం అర్ధవృత్తాకారంలో వున్న గర్భగుడి—ఇవీ ఆ దేవుడి మడిమాన్యాలు, గుడిగోపురాలు అన్నీ, ఈ మాత్రమయినా ఆస్తిపాస్తుల్ని అతనికి ఏర్పరచిన ఉదారత్వం ఆ వూరి మునసబు సీతారామయ్యగారిది. ఆ వూరూ ఆయన పేరు మీదుగానే స్థిరపడింది. పట్టాభిరాముణ్ని నెలకొల్పిన కారణంగా అతని ఇంటిపేరూ 'పట్టాభి'గానే మారిపోయింది.

పట్టాభి సీతారామయ్యగారి మాటంటే ఇక తిరుగులేని రామబాణమే అతని హయాంలో. తన రోజులు చెల్లినంతకాలమూ సీతారామయ్య ఓ వెలుగు వెలిగించేడు దేవుణ్ని. నవమి ఉత్సవాలు, దసరా వేడుకలు, ఏకాదశి వ్రతాలు, శివరాత్రి జాగరణలు - అన్నిటినీ ఏ ఒక్కదాన్నీ విడవకుండా, ఎవరికీ ఎల్లాంటి భేదభావమూ రాకుండా జరిపించేడు సీతారామయ్య ఆ రామాలయంలోనే. అయినా కాలం మారి, ఆయువు తీరి ఆయనటు వెళ్లిపోవడంతోటే ఆ ప్రాభవమూ తగ్గింది పట్టాభిరాముడికి.

ముందు నిలిచి నడిపించే మొదటివాడు లేనందున ఆలయం ఆలనా పాలనా చూడడానికి ఓ కమిటీ కావలసొచ్చింది. అందులో చేరిన ఆ నలుగురూ నా దారి ఇటంటే నా దారి ఇటంటూ తగూలాడుకోవడం హెచ్చింది. అదే అదనని "దేవుడి పెళ్లికి అందరూ పెద్దలే" అన్నట్టే "దేవుడి ఆస్తికి అందరూ వారసులే" అనుకుని ఎవరికి వారే చేతికి చిక్కినంతా స్వాహాచేసేసేరు. ఈ సంగతి వూళ్లో నలుగురికీ తెలిసి ఇదేమిటని అడిగితే "ముందు వాడిదగ్గర రాబట్టండి. ఆప్పైన నాదేం అట్టే ఆలస్యంలేదు" అంటూ ఒకరి మీదొకరు చాటుకుంటూ కాలాన్ని నెట్టుకొచ్చేరు. పైవాళ్ల దయాదాక్షిణ్యాలనీ, వాళ్ల మోచేతికింది నీళ్లనీ తిని తాగి బతికే అలపరి మూక ఆ విషయమ్మై మరెవ్వరినీ నోరెత్తి అడగలేకపోయింది. దాంతో అటు దేవుని దారి దేవునిదీ, మనిషి దారి మనిషిదీ అయిపోయింది.

కాకుంటే ఆ మధ్యన ఓ రెండు మూడేళ్లపాటూ ఆ గుడి నంటి పెట్టుకున్న పూజారే ఏదో వున్నంతలో పూజా పునస్కారాలని జరిపించేవాడు దేవుడికి. ఉన్న తన ఒక్క ప్రాణాన్నీ ఆ రాముని సేవలోనే తరింపజేసుకోవాలనుకున్నాడు. తొందర్లోనే ఆ పూజారి కోరికా తీరింది. లేక లేక పట్టుకున్న గాలివానల్లో ఈదురుగాలికి తట్టుకోలేని ఆ ముసలి బక్కప్రాణం ఆలయం వెనక పూరిగుడిసెలో తనువుని చాలించి తనుమాత్రం అచ్యుత రామునిలో ఐక్యమైంది.

సరిగా ఆ సమయంలోనే ఆలయం పక్క ఏపుగా ఎదిగిన గంగిరావిచెట్టూ మొదలంటా నరికిం దానికిమల్లే ఫెళ ఫెళా విరిగిపడింది. పొడవైన దానికొమ్మలు తగిలి ప్రహరీ గోడంతా పూర్తిగా పడిపోయింది. ఆ వైపున ఇటుకలు రాలి గుడిగోపురమూ సగానికి సగం కూలిపోయింది. గర్భగుళ్లో దీపంపెట్టే దిక్కులేక చీకట్లోనే చిక్కుకుపోయిన పట్టాభిరాముడికి మిట్టమధ్యాహ్నం "దిగుల్లేదు నేనున్నా"నంటూ దివ్విటీ పట్టేడు సూర్యుడు. "ఎప్పుడో దండకారణ్యంలో వుండగా చేసేవు వెన్నెల స్నానాలు సీతమ్మవారితో. ఇదిగో అల్లాంటి అవకాశమే ఇప్పుడూ వచ్చింది. చెయ్యి" అంటూ నడినింగిని కాసేపాగి వెన్నెల్ని కురిపించేవాడు చంద్రుడు. విరామం లేక నూనె జారి జారీ జిడ్డోడుతోన్న శరీరానికి సుడి తిరిగి తిరిగి హాయిగా వీచేది చల్లగాలి.

అయినా దేవుడికేది సుఖాన్నిస్తుందో, కష్టాన్ని కలిగిస్తుందో నిక్కచ్చిగా అంచనాకట్టి తెలుసుకోలేని ఆ వూరి జనం అది చూసి హడిలిపోయేరు. అంతా ఓచోట పోగయ్యేరు. ఆ రాముడి గుళ్లో నిత్యం దీపారాధన జరక్కపోవడమే తమ బతుకుల్లో పేరుకున్న అంతటి చీకటికీ కారణమన్నారు. పడిపోయిన గుడిగోపురాన్ని బాగుచేయిస్తేనే తమకి నిలవడానికింత నీడ దొరుకుతుందనుకున్నారు. ఒక్కుమ్మడిగా అందరూ వెళ్లి ఆ పట్టాభి సీతారామయ్యగారి సంతానం—ఆయనగారి జ్యేష్ఠపుత్రుడు- పట్టాభి పరంధామయ్యగారి కాళ్లావేళ్లా పడ్డారు. పాడయిపోయిన పట్టాభిరాముడి గుడినిబాగుచేసి గతించిన తండ్రిగారి యశస్సుని నిలపమన్నారు. పోయింది పోను మిగిలిన ఆ దేవుని ఆస్తిని ఇకనుంచయినా రక్షించమన్నారు. అందుక్కావలసిన పైకం ఆ తిన్న పెద్దమనుషులు ఎటూ ఇంక ఇవ్వరు గనక ఏదో తమకి కలిగినంతలో తృణమూ, పణమూ కూడబెట్టి ఇస్తామన్నారు. చివరగా "అల్లాంటి మంచి బుద్ధిని ఇంక మీకు ఆ పట్టాభిరాముడే పుట్టించాలి" అని ఆ భారాన్ని అసలు వానిమీద కూడా కొంతలో కొంతగా వుంచేరు.

గతించిన తండ్రినీ, మీరుతప్ప వేరే గతిలేదని తన కాళ్లు పట్టుకున్న జనాన్నీ చూసి, కానీ ఖర్చులేకుండా కొద్దిపాటి శ్రమతోనే తన తండ్రిగారి పేరుప్రతిష్ఠల్ని తిరిగి తనూ పొందవచ్చుననీ తలపోసి "మీ భరోసాతో దిగుతున్నా నిందులోకి. మీరంతా ఇచ్చిన మాటని ఎల్లా నిలబెట్టుకుంటారో చూస్తా"నంటూ ఆ భారం కాస్తా తన భుజస్కంధాలమీదికి ఎత్తుకున్నాడు పరంధామయ్య.

"పదిమంది మాట. పైగా దేవుని కార్యం. ఇవ్వాల్సిందే ఎల్లాగయినా" అని తమలో తామే అనుకుని పదో, పాతికో తమకు వీలయినంతా చందాగా కట్టేరు జనం అతని దగ్గర.

"నాగలికింత ఇచ్చుకోవాలి" అంటూ వసూలు చేసేరు కూలీల దగ్గర.

"పెదబాబులు. ఊళ్లోకల్లా తమదే పైచేయి. వెయ్యిన్నూట పదార్లయినా ఇచ్చుకోవాలి తమరు" అంటూ ఆకాశానికెత్తి మరీ అందుకున్నారు కాపుల్నుంచి.

కరణం కామయ్యా, బడిపంతులు గోపాలయ్యా బొత్తిగా ఇవ్వకపోతే బావుండదు గనక కొంత సర్దిచెప్పుకుని తమచేత గలిగింది ఇచ్చేరు చెరో పాతికా.

ఊళ్లో అందరి దగ్గరా కానిచ్చి చాలందానికి పొరుగూళ్లలోనూ పేరుమోసిన కామందుల దగ్గర వసూలు చేసేరు చందాలని.

అల్లా తాము వసూళ్లు చేస్తోన్న సందర్భంలోనే చలపతి ప్రసక్తి తెచ్చేడు వెంకటాద్రి.

"అవును పరంధామయ్యా! పద్దులో అందరి పేర్లూ వున్నాయిగాని ఆ చలపతిరావు పేరు కనబడదే" తెలిసి తెలిసీ ఓ మాటపదార్లు నిష్కారణంగా జారిపోతున్నాయే అనే బాధ వినిపించిందతని మాటల్లో.

చలపతి పేరు చెప్పగానే చిత్రంగా చూసేడు పరంధామయ్య వెంకటాద్రిని.

"చలపతి సంగతి తెలిసీ అంటున్నావా ఈ మాట? వాడిస్తాడా ఇల్లాంటి వాటికి? అడిగీ లేదనిపించుకోవడంకంటె అసలు అడక్కపోడమే మంచిది" పద్దులో చలపతి పేరుని చేర్చకపోవడానికీ, తను అతని దగ్గరికెళ్లి అడక్కపోవడానికీ వున్న కారణాన్ని వివరించేడు.

వెంకటాద్రి కొంత ముందుకి జరిగేడు. "అదికాదయ్యా! చలపతి పిసినారీ కాడు. అనుకుంటే ఏదో కొంత ఇవ్వనూ ఇవ్వగలడు. కాకుంటే అతనికీ దేవుడూ, గీవుడూ అంటే గిట్టదనుకో. కానీ ఆ అడగడం మనమే వెళ్లి అడిగితే, అందులోనూ నువ్వయితే కాదు పొమ్మని చెప్పలేడని నా అభిప్రాయం. ఆలోచించు."

"ఏమాత్రం గాలి వీస్తున్నా తూర్పార పట్టాల్సిందే అనే సిద్ధాంతం వెంకటాద్రిది. వీలుందని తెలియాలే గాని మొసలి నోటి మంచయినా పెకలించుకు రాగలడు మాణిక్యాన్ని.

అతని మాటలూ కొంత పనిచేసేయి పరంధామయ్యమీద. కాసేపు ఆలోచనలో కాలాన్ని వ్యయంచేసి అన్నాడు అరుగు దిగుతూ. "అల్లాగే వెంకటాద్రీ! నీ మాటమాత్రం ఎందుకు కాదనాలి? అడుగుతాను చలపతిని. ఇచ్చేడా అది ఆ పట్టాభి రాముడి సంకల్పం. లేదా ఆ చలపతిగాడి దౌర్భాగ్యం. వెళ్లొస్తా. నువ్వుండు...ఇక్కడే" పొగాకుకాడ ఒకటి వెంకటాద్రిముందు పడేసి తను బయలుదేరేడు కాళ్లకు చెప్పులు తగిలించుకుని.

చలపతీ పరంధామయ్యా చిన్నప్పుడెప్పుడో కలిసి చదువుకున్నారు వీధి బళ్లో. ఆపైన బేసిక్ స్కూల్లోనూ రెండేళ్లు కలిసి చదివేరు.

పరంధామయ్యమాత్రం మధ్యలోనే భరతవాక్యం పలికేసేడు చదువులకి. ఇంటిపట్టున్నే వుండి పొలం పనులు చూసుకోసాగేడు. అతను పొలంపనులు చూసుకోడమంటే ఇంట్లో వాలుకుర్చీలో పడుకునే పాలేర్లని పురమాయించడం–ఇంటికి చేరిన ధాన్యాన్ని ఎప్పుడు ఎక్కడ ఎల్లా అమ్ముకోవాలో తెలిసి అమ్ముకోవడం!

మరి చలపతి పరంధామయ్యలా అంతటితో ఆగిపోక ఇ. ఎస్సెస్సెల్సీ పాస్ చేసేడు. టీచర్ ట్రెయినింగూ అయ్యేడు. అప్లికేషన్ పెట్టుకోవడమూ, అపాయింట్ కావడమూ ఒక్కమారే జరిగి ఓ మేనేజిమెంటు స్కూల్లో సెకెండరీ గ్రేడ్ టీచర్అయ్యేడు. మేష్టారు గిరీని ఓ అయిదేళ్లపాటూ వెలగబెట్టి ఆ తర్వాత ఎవరో ఆ స్కూల్ కమిటీ మెంబర్ అబ్బాయికి వాళ్లడిగినట్టు మార్కు లేసి పాస్ చేయించక మేనేజిమెంటుతో తగూ తెచ్చుకుని చిలికి చిలికి గాలివానలా తయారయిన ఆ తగువులోస్తే రాజీ కుదుర్చుకుని ఆ చోటే వుండలేక ఓ రాజీనామా గిలికి పడేసి చేస్తోన్న వుద్యోగానికి తిలోదకాలిచ్చేసేడు. వొస్తూ వొస్తూ ఇంటికి ఎవర్తో ఓ మొగుడు చచ్చిన పడుచు పిల్లని వెంటబెట్టుకొచ్చి, దాని విషయమై అమ్మా నాన్నలతో, అన్నదమ్ములతో పేచీపడి ఆస్తిలో తనకి రావలసిన వాటా కేటాయించుకుని, వాళ్లతో తెగతెంపులు చేసుకుని వొచ్చేసేడు సీతారామపురానికి.

అక్కడ పాతమిత్రుడు పరంధామయ్య పలుకుబడితో వూరికి దూరంగా స్థలం కొంత కొనుక్కుని ఇల్లొకటి కట్టించుకున్నాడు. ఆ పిల్లతో అక్కడే కాపురం పెట్టేడు. తండ్రి చేస్తూ వొచ్చిన ఆయుర్వేద వైద్యంతో వున్న పరిచయంకొద్దీ తన ఇంటినే ఓ చిన్న ఆస్పత్రిగా మార్చేసేడు. ఆరెంపి సర్టిఫికెట్టొకటి తెచ్చుకుని అటు నాటు మందులతో బాటు ఇటు ఈ కాలం ఇంగ్లీషు మందుల్నీ వాడడం మొదలెట్టేడు. అదేం కలిసిరావడమోగాని అతని హస్తవాసి మంచిదనో, మనసు వెన్నపూస లాంటిదనో, చేతగలిగి ఇచ్చిందానితో సరిపుచ్చుకుంటాడనో జనం ఏ కడుపు నొచ్చినా, కాలునొచ్చినా అతని దగ్గరికే వెళ్లేవాళ్లు. వైద్యం చేయించుకునేవాళ్లు.

రాత్రిళ్లు తాగొచ్చి, చెవులు చిల్లులు పడేలా బూతులు తిట్టి, చితగ్గొట్టి అది చాలదన్నట్టు ఆకలి కడుపుల శరీరాల్ని నానా హూనం చేసే మొగుళ్లున్న ఆడపడుచులు.

పొలంగట్ల దెబ్బలాటల్లో అసలు కామందుల్ని అల్లావుంచి కూలికొచ్చిన జనంమీద చేతనున్న పలుగులూ పారల్తో అత్యాచారం సాగించే రైతులకింది జీతగాళ్లూ "చలపతయ్యా! ఆ పట్టాభి రాముడు మరెక్కడో లేడయ్యా! నీలోనే వున్నా"డన్నారంటే, ఇంకా అల్లాగే అంటూ వుంటారంటే అది ఆ అలగాజనం అజ్ఞానం!

అల్లాంటి చలపతింటికి అడపా దడపాగానైనా, కనీసం ఆస్పత్రి మందులకైనా వెళ్లిరావడం ఇష్టంలేని తను ఇప్పుడు పని గట్టుకుని వెళ్లడం బావుండలేదు పరంధామయ్యకి. అయినా తప్ప లేదు. ససేమిరా వాడింటికి నే వెళ్లనంటే దాన్ని మరోలా అనుకో గలడు వెంకటాద్రి.

గుడివీధి మలుపు తిరిగి చింతచెట్లు దాటుకున్న పరంధామ య్యకి దూరంగా కనిపించింది చలపతి ఇల్లు.

పొలాలమధ్య రాళ్లమిట్ట పక్కన పర్ణకుటీరంలా వుంది అది. చుట్టూ పెట్టించిన కొబ్బరిచెట్లు మనిషెత్తు ఏపుగా ఎదిగి ప్రహ రీలా వుంది ఇంటికి. పైకి త్రికోణాల్లా కనిపించేట్టు నేలనుపాతిన ఇటుక రాళ్లమధ్య నడిచేడు పరంధామయ్య.

ఇంటికి కుడివేపు గోడకి చేర్చి దించిన వసారాకింద కూచుని వున్నాడు చలపతి ఎవరితోనో మాట్లాడుతూ.

తనని చూడగనే లేచి, ఎదురొచ్చి "ఏమిటో విశేషం! ఇటు మళ్లింది గాలి" అన్నాడు. చేతులు సాచి ఆహ్వానించేడు.

అతన్నీ, అతని వాలకాన్నీ గమనిస్తూ సైన్యసహాయం కోరి కృష్ణుడింటికి వెళ్లిన దుర్యోధనుడిలా అభిమానంతో అతనున్న బెస్ట్ కండిషన్‌ని అంగీకరించలేక వేగిపోతూ నడిచేడు లోపలికి.

"రోజులు మారుతా యనడానికి నిదర్శనం నువ్వివాళ మా ఇంటికి రావడమే. రా! కూర్చో" టేబుల్‌కి అటువేపుగా వున్న కుర్చీ చూపించేడు చలపతి.

దానిమీద కూచుంటూ తనకెదురుగా వున్నతన్ని చూసేడు పరంధామయ్య. పాంటూ షర్టులో వున్నాడు మనిషి. రంగు కాస్త తక్కువయినా కళవుంది మొహంలో. పై చదువులుతెచ్చిన హుందా వుంది.

అతనికేసి-చూసీ చూడనట్టుచూస్తూ అనుకున్నాడు తనలో "ఎక్కడో చూసినట్టుందే ఇతన్ని" అని.

అప్పుడే అన్నాడు చలపతి "ఎవరనుకున్నావ్? మనం థర్డ్ ఫాం చదువుతోన్నపుడు మనకి క్లాస్‌మేట్. గుర్తులేదూ కృష్ణ శాస్త్రి."

"ఓహో! ఆ కృష్ణశాస్త్రా! చాలా మారిపోయేడే!" అన్నాడు పరంధామయ్య.

అతన్నీ గుర్తుచేసేడు చలపతి కృష్ణశాస్త్రికి.

"ఎవరూ పరంధామయ్యా!" తనకి మరో బాల్యస్నేహితుడు కనిపించేడన్న ఆనందంతో "గ్లాడ్ టు సీ యూ" అంటూ అందుకో బోయేడు అతని చేతిని.

ఉన్నఫళంగా తన చేతిని వెనక్కి లాక్కుని "నమస్కారం" అన్నాడు పరంధామయ్య. ఏదో తెలియని కంపరం పుట్టుకొచ్చిం దతనిలో. కారణం ఆ కృష్ణశాస్త్రి ఊరిచేత వెలి వేయబడినవాడు కావడం!

"ఊర్నే వెలి వేసినవాడు మనవాడు" అనేవాడు చలపతి అప్పట్లో అతన్ని చూపి.

చలపతి నిలుమన్నవాడు అట్టే లోపలికెళ్లి మళ్లీ వొచ్చి కూచున్నాడు వాళ్లమధ్య టేబుల్ వెనక కుర్చీలో.

"ఏం చేస్తున్నావు నువ్విప్పుడు?" అడిగేడు పరంధామయ్య కృష్ణశాస్త్రిని లాంఛనంగా.

"మెడిసిన్ చదివేను. డాక్టర్‌గా వున్నాను మదనపల్లి శాని టోరియమ్‌లో. ఎవరో పేషెంట్‌ని తీసుకుని అక్కడికొచ్చి అనుకో కుండా కలిసేడు చలపతి. లేదంటే ఈ ప్రాంతాలకే వొచ్చేవాణ్ని కానేమో నేను" చెప్పుకున్నాడు కృష్ణశాస్త్రి.

"అల్లాగా? సంతోషం!" అన్నాడు పరంధామయ్య.

"ఇంతకీ అసలు సంగతి చెప్పేవు కావు" చలపతి అడిగేడు పరంధామయ్యని.

ఇటూ అటూ ఇద్దర్నీ చూసి, చెబుదామావొద్దా అని సంకో చించి ఎల్లాగో చెప్పేడు పరంధామయ్య "పడిపోయిన పట్టాభిరాముడి గుడిని బాగుచేయిద్దామని అనుకుంటున్నాం.

అందుకేవో వూళ్లో చందాలు వసూలుచేస్తూ..." నసిగేడు తర్వాత చెప్పక.

"అయితే నా దగ్గరికీ చందాకోసమే నన్నమాట రావడం" తనే అందుకుని అన్నాడు చలపతి. చివరగా నవ్వేడు.

ఆ నవ్వుతో దేవుడి పేర చందా చలపతి యివ్వడన్న అను మానమే బలపడింది పరంధామయ్యకి.

"అది కాదు. ఊళ్లో నలుగురికీ వుపయోగం వున్నపని. అందుకని..." అని ఇంకా ఏదో అతననబోతోన్నంతలో లోపల్నుంచి వొచ్చింది ఒకావిడ.

కాఫీగ్లాసులు టేబుల్ మీదుంచి ట్రేతో వెళ్ళిపోయింది మళ్లీ లోపలికి.

"ఇంత బావుంది గనకే లేపుకొచ్చేడు పీడీ పిల్లని" అను కున్నాడు పరంధామయ్య. ఆమెని చూసి.

చలపతి ఓ గ్లాసుని కృష్ణశాస్త్రి కిచ్చి అదే చేత్తో మరో గ్లాసుని ఇచ్చేడు పరంధామయ్యకి.

పరంధామయ్య అందుకున్నాడు కాఫీ గ్లాసుని. చూసేడు కృష్ణశాస్త్రి వంక, చలపతి వంక. గ్లాసుని పెదాల దగ్గరికి తీసికెళ్లేడు. కృష్ణశాస్త్రి తాగుతోన్న గ్లాసే చేతులుమారి తన దగ్గరి కొచ్చిందనిపించింది అతనికి. కడుపులో చెయ్యుంచి దేవినట్టయింది.

"మరేం అనుకోకు చలపతీ! కాఫీ తాగడం మంచిది కాదని మానుకుంటున్నా నీమధ్య. ఏం చేద్దాం? చూస్తే మాత్రం తాగాలనిపిస్తుంది. అయినా వొద్దులే. చెరుపు చేస్తుందని తెలిసీ చెయ్యడం ఎందుకు కాని పని?" అంటూ అల్లాగే పెట్టేసేడు కింద.

"కాఫీ, టీలు మంచివి కావని మా డాక్టర్లే అనుకోడంలేదే" తిన్నగా నవ్వుతూ చెప్పేడు కృష్ణశాస్త్రి.

కాఫీ తాగడం ముగించి ఇద్దరూ గ్లాసులుంచేరు పక్కన.

చలపతి టేబుల్ సొరుగు లాగి, సిగరెట్ పేకేట్ బయటికి తీసి చూసి "అయ్యో అయిపోయేయే" అంటూ పడేసేడు టేబుల్ కింది బాస్కెట్‌లో.

"నా దగ్గరున్నయ్" పాంటు జేబులో చెయ్యోదిలి కొత్త పేకెట్ తీసేడు కృష్ణశాస్త్రి. అందులోంచి తనొకటి తీసుకుని, చలపతి కొకటిచ్చి పరంధామయ్య ముందుంచేడు కవర్ తెరిచి.

"చెడ్డదేనట దీన్ని తాగడమూ. మానేసేవా కొంపదీసి – దివాలా తియ్యగలవ్ సిగరెట్ కంపెనీలు" నవ్వుతూనే అని సిగరెట్ అంటించుకున్నాడు చలపతి అగ్గిపుల్ల గీసి. కృష్ణశాస్త్రి వుంచుకున్న సిగరెట్‌నీ అంటించేడు తనే.

చేసేదిలేక తనూ ఓ సిగరెట్ అందుకుని వెలిగించుకున్నాడు పరంధామయ్య. అంటీ అంటనట్టు పీల్చేడు దాన్ని. ఎప్పుడూలేనిది అతని కళ్ళవెంట నీళ్లని తెప్పిస్తోంది ఆ పొగ.

"మరి అవతల చాలా పనులున్నయ్ చలపతీ! నే వెళతా' అంటూ లేవబోయేడు పైకి.

"అప్పుడేనా? వొచ్చిన పని కాకుండానే" అన్నాడు చలపతి.

"అంటే..." అనుమానంగా చూసేడు పరంధామయ్య.

"ఏదో చందా అన్నావుగా. ఇస్తా తీసికెళ్లు" లాల్చీ జేబులు తడిమి తీసేడు నోట్లు వెలుపలికి.

"ఎంతిమ్మంటావ్?" అడిగేడు నవ్వుతూనే.

చలపతిని నమ్మడం అటుంచి తన కళ్లని తనే నమ్మలేక పోయేడు పరంధామయ్య.

"ఏ మాటా అనకుండా ఇస్తానంటున్నా డేమిటి వీడు?" అనుకున్నాడు. జేబులోంచి ఓ చిన్నపాటి పుస్తకాన్ని తీసేడు. పేజీలు కొన్ని తిరగేసి ఓచోట చూపేడు.

భక్తాగ్రేసరుల అడ్రెసులతో బాటుగా విరాళాల వివరాలూ వున్నాయి అందులో. వాళ్ల వాళ్ల అంతస్తుకి తగ్గట్టు ఉన్నంతలో ఉడుతాభక్తి ముడుపులు చెల్లించేరు వాళ్లంతా.

"ఇదిగో లెక్కెట్టుకో నూట పదార్లున్నాయి" అంటూ డబ్బుల్నిచ్చేడు చలపతి.

"ఇందులోరాయ్ నీ చేత్తోటే" డబ్బు లందుకుని ఆ పుస్తకాన్ని ముందుకి జరిపేడు పరంధామయ్య.

"ఉండనీ...నా చెయ్యెందుకులే మధ్యలో" అని దాన్నల్లాగే వుంచేడు చలపతి.

డబ్బుల్నీ, పుస్తకాన్నీ ఒకేమారే జేబులో వుంచుకుని "మరి నే వెళ్ళిరానా?" అని లేచేడు పరంధామయ్య.

"అయితే ఒక్కమాట" తనూ లేచి అన్నాడు చలపతి "ఇల్లాగా నేనివ్వడం నాకెక్కువై కాదు· పుణ్యం మూటగట్టుకుందామనీ కాదు. కేవలం స్నేహితుడివి ... ఇంతదూరం వెదుక్కుంటూ వొచ్చావే అనే ..." ఆప్యాయంగా వీపు చరిచి సాగనంపేడు చలపతి.

మాట వరసగానైనా కృష్ణశాస్త్రితో వెళ్లొస్తానని చెప్పకుండా అదేదో నరకాన్నుంచి బయటపడ్డవానిలా ఫీలవుతూ చకచక నడిచేడు పరంధామయ్య.

నడుస్తూ సాయంత్రం అయి ఇంటిదారి పట్టిన కూలీలని చూసేడు. వాళ్లలో మగాళ్లని మినహాయించి, ముసలోళ్లనీ, కుర్రాళ్లనీ తప్పించి వయసులోవున్న ఓ పిల్లపైనే తన కళ్లని నిలిపేడు. ఆ ఒంటి ఒడుపులతోనే తన చూపుల్నీ నడుపుతోన్న పరంధామయ్యకి ఠక్కున గుర్తొచ్చింది మధ్యాహ్నం సీతాలు చెప్పి పంపిన మాట.

ఈ ఏడాది ఎల్లాగయినా తిరునాళ్లకి రంగమెళ్లాలంది అది. ఎల్లా లేదన్నా ఓ వంద రూపాయలవుతుంది ఇద్దరికీ. ఉన్నట్టుండీ అల్లా ఇబ్బందిపెట్టి అడిగితే ఎక్కడి నుంచి తేగలడు తను డబ్బుల్లేని సమయంలో.

"ఛీ వెధవముండ! ఎప్పుడడగాలో తెలీదు" గొణక్కున్నాడు పరంధామయ్య. ఊరు చేరుకున్నాడు.

"ఏదోలాసర్ది దాని ముచ్చట తీర్చాల్సిందే. లేదంటే దగ్గరికి చేరనివ్వదు సానిముండ" అనుకుని అంతలోనే ఏదో ఉపాయం తట్టినట్టు చలపతి ఇచ్చిన ఆ నూటపదార్లూతీసి రొండిన పంచెకట్టులో దోపుకున్నాడు. వీధిమలుపు తిరిగేడు.

అక్కడే ఎదురయ్యేడు వెంకటాద్రి "ఏం పరంధామయ్యా! ఏమన్నాడు చలపతి? ఇచ్చేడు కదూ" అడిగేడు ఇచ్చివుంటాడన్న నమ్మకంతోనే.

సమాధానంగా ముందుగానే ఓ నవ్వు రువ్వుతూ అన్నాడు పరంధామయ్య – "నే చెప్పలా అప్పుడే ... ఆదర్శాల మనిషని! ఇల్లాంటి మంచి పనులంటే గిట్టవు అతగాడికి."

వెంకటాద్రి విస్తుపోయేడు.

"పోనీలే పరంధామయ్యా! వాని పెడపరంబుద్ధులు వానివి. మధ్యలో మనమేం చేస్తాం? అంతా ఆ రాముడే చూసుకుంటాడు" వీధి మొగనవున్న పట్టాభిరాముడి గుడికేసి చూపుతూ అన్నాడు వెంకటాద్రి.

పరంధామయ్య బొండిని ఓమారు తడిమి చూసుకున్నాడు.

ఏ శిల్పి మలిచేడోగాని అతన్ని అంత పనీ తన కళ్లెదుటే జరుగుతోన్నా ఆ చిరునవ్వు మొహంతోనే వున్నాడు శ్రీరాముడు!

---

# ఒంటరి ఆకాశం

## శ్రీ రామచంద్రమౌళి

కోనిఫర్ చెట్లు
యీ నేల పర్వతాల పిడికిలితో ఆకాశంలోకి విసురుతున్న
యినుప బాణాల్లా కనిపిస్తాయి నాకు
పిడుగులనూ, సముద్రాలనూ వర్షించిన యీ ఒంటరి
ఆకాశం
ఎంత నిర్మలంగా నవ్వుతూంటుంది యీ ఎండాకాలపు
సాయంకాలాల్లో
అప్పుడు
కొండల్లో కష్టించే యీ దేశపు నా అమాయక జనమే నా
నిండా నిండిపోతారు– తీయని స్మృతులై
వాళ్ళ నీలాల కళ్ళు
ఒట్టి నవ్వే తెల్ల గన్నేరు పూలు
మట్టిలోనుంచి పుట్టిన వాళ్ళ శరీరాలు
బండల్లా మెరుస్తూ
వెన్న గుండెలో ఓ మండే నిప్పును కాపాడుకుంటూంటాయి
భద్రంగా –
పిల్లి పంజా విప్పినవుడు ఎంత భయంకరంగా వుంటుందో
కుర్చీలలో కూర్చుని నవ్వేవాళ్ళకు తెలిసేవుంటుంది –
హహ్హాహ్హా ... పిచ్చివాళ్ళు...!
దేశాన్ని నగరాల్లోకి తరుముకొస్తున్నారు
బందెల దొడ్లోకి పశువులను తోలుకొస్తున్నట్టు –
మళ్ళించండి యీ దారిని పల్లెల వనాల్లోకి,
గ్రామాల గవాక్షాల్లోకి –
లేకుంటే నీ గతి
పసివాడు పాలకోసం స్తనాన్ని విడిచి బొటన వేలును
చీకుతున్నట్లుంటుంది–

